భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి వేడుకలు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో శనివారం వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయమే పుణ్యస్నానాలాచరించి ఇంటిల్లిపాది ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయాల నిర్వాహకులు స్వామి, అమ్మవార్లను ఉత్తర ద్వార దర్శనం చేయించి ఆశీర్వదించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పలుచోట్ల భరతనాట్యం, భక్తి ప్రవచనాలు, రథోత్సవం, కట్టికోలన్న, నందికోల సేవ, చెక్కభజన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.


కృష్ణగిరి మండలం కర్లకుంటలో స్వామి వారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

కృష్ణగిరి: మండలంలోని కర్లకుంట గ్రామంలో తిరుమలరాయుని ఆలయంలో స్వామి వారిని ఉత్తర ద్వారంలో భక్తులు దర్శించుకున్నారు. ఇక్కడ ఆలయ నిర్మాణం ఉత్తర ద్వారంతో ఉండటంతో ఏటా ముక్కోటి ఏకాదశి వేడుకలను గ్రామస్తులు వైభవంగా నిర్వహించుకుంటున్నారు. సుదర్శన హోమం, శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలరాయునికి కల్యాణం నిర్వహించారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో హాజరై స్వామివారిని కనులారా వీక్షించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను గరుడ వాహనంపై ఊరేగించారు.


కర్లకుంటలో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కుటుంబ సభ్యులు


భూదేవి, శ్రీదేవి అమ్మవార్లతో రామళ్లకోట వనం శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి కల్యాణ దృశ్యం

వెల్దుర్తి మండల పరిధిలోని రామళ్లకోట వనం శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈఓ ఆంజనేయులు, ధర్మకర్త వెంకటేశ్వర్లు, సర్పంచ్ నిర్మల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సహిత వెంకటేశుని ఉత్తర ద్వార దర్శనం, కల్యాణం కమనీయంగా సాగింది. అనంతరం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే వెల్దుర్తి–బేతంచెర్ల మండలాల మధ్య శ్రీరంగాపురం కొండల్లో పాలుట్ల రంగస్వామి వారి కల్యాణం కమనీయంగా సాగింది. మదార్‌పురం గ్రామంలో శ్రీలక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు, కల్యాణం కనుల పండువగా సాగాయి. వెల్దుర్తి మండల కేంద్రంలో రాయలకాలంనాటి శ్రీరాముల ఆలయంలో సీతారామలక్ష్మణులు భక్తులకు ఉత్తరద్వార దర్శనమవ్వగా భక్తులు పరవశించారు. జర్నలిస్టు కాలనీలోని ఆలయ సమూహంలో వెంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిపించారు.

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో కొలువైన శ్రీదేవిభూదేవి సమేత శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఆర్.హనుమంతరెడ్డి, అర్చకులు విద్యాధర్‌స్వామి ఆధ్వర్యంలో భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు.


క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు


పెరవలిలో ఉత్తర ద్వారంలో దర్శించుకుంటున్న భక్తులు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధ శ్రీరంగనాథస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథ స్వాముల వారు గరుడ వాహనంపై ఉత్తర ద్వారమున భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో పాలు, ప్రసాదం అందజేశారు. మద్దికెరలోని చెన్నకేశవస్వామి, నగిరేశ్వర స్వామి ఆలయంలో శ్రీవెంకటేశ్వరస్వామి భక్తులకు ఉత్తరద్వార దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, దేవాలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, దాతలు పారా రామచంద్ర ప్రసాద్, పారా విశ్వనాథ్ (చిట్టిన్న), సర్పంచ్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు: స్థానిక బళ్లారి రోడ్డు సమీపంలో ఉన్న రుక్మిణీ పాండురంగస్వామి ఆలయం, చెన్నకేశవ స్వామి, హత్తిబెళగళ్ గ్రామంలో మంత్రాలయం రాఘవేంద్రస్వామి అమృత హస్తాలచే ప్రతిష్ఠించిన ప్రఖ్యాతిగాంచిన పంతవెంకన్న ఆంజనేయస్వామి వివిధ గ్రామాల్లో కొలువుదీరిన ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.


పూజలందుకున్న కూర్మ నారాయణస్వామి

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో సహజ సిద్ధ ఉత్తర ముఖ ద్వారంగా వెలసిన కూర్మనారాయణస్వామి ఆలయంలో శనివారం ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించారు. వేదపండితులు మహేశ్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి గంగపూజ, అభిషేకం, అర్చన, అలంకరణ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు భజనతో గిరి ప్రదక్షిణ, నవ నాగదేవతల పుట్టలకు పూజలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు.


ఉత్తర ద్వారం ద్వారా కూర్మ నారాయణ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


వెంకటసాయి ఆలయంలో పూజలందుకుంటున్న వెంకటేశ్వరస్వామి


ఎమ్మిగనూరులో శ్రీ వెంకటేశ్వర స్వామి రథోత్సవం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని వేంకటసాయి ఆలయం గోవింద నామస్మరణంతో మారుమోగింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం స్వామి వారిని భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. అనంతరం వెంకటేశ్వరస్వామి శ్రీదేవి, భూదేవిల కల్యాణం జరిపించి, హోమం నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుంచి శాంతిహోమ్ సర్కిల్ వరకు రథోత్సవాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి, వీరశైవ లింగాయి కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్, మున్సిపల్ చైర్మన్ డార్టర్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ రాజశేఖర్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వెంకటాపురం కాలనీ, ట్యాంక్ బండ్ రోడ్డులో ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఏకాదశి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాళ్లదొడ్డి గ్రామంలో వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం


అలువాలలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి


చెన్నాపురంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

- ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

గోనెగండ్ల/ఎమ్మిగనూరు రూరల్: సచివాలయాల ఏర్పాటుతో పాలన ప్రజల ముంగిటకే తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి అన్నారు. శనివారం గోనెగండ్ల మండలంలోని అలువాల గ్రామంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న సచివాలయం, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ సెంటర్లను ప్రారంభించారు. అలువాల గ్రామం నుంచి బెళగల్ గ్రామం వరకు రూ.3.40 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులను ప్రారంభించారు. అలాగే ఎమ్మిగనూరు మండలం చెన్నాపురం గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ అలువాల – బెళగల్ బీటీ రోడ్డు పూర్తయితే గోనెగండ్ల, బెళగల్ మండలాలకు రాకపోకలకు సులువుగా ఉంటుందన్నారు. ఇప్పటికే గంజిహళ్లి నుంచి ఎమ్మిగనూరు మండలం నాగలాపురం వరకు, పెద్దనేలటూర్ నుంచి చిన్నమరివీడు మీదుగా పెద్దమరివీడు తదితర గ్రామాల నుంచి ఎమ్మిగనూరుకు కలిసే విధంగా బీటీ రోడ్డు వేశామన్నారు. అయ్యకొండ నుంచి కడిమెట్ల మీదుగా ఎమ్మిగనూరు వెళ్లేందుకు ఎల్లెల్సీపై బ్రిడ్జి ఏర్పాటు చేయడంతో ఆయా గ్రామాలకు రకాపోకలకు ఇబ్బంది లేదన్నారు. అలువాల వద్ద తూము ఏర్పాటు చేసి ఎల్లెల్సీ నీటిని అలువాల వరకే అంకితం చేసి, జీడీపీ ద్వారా ఎల్లెల్సీ నీటిని కిందకు వదిలే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం జగన్ సహకారంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు వేస్తున్నామన్నారు. సీఎం జగన్ పాలనలో అభివృద్ధి పరుగులు తీస్తుందని చెప్పారు. కాబట్టి ఇన్ని చేసిన ముఖ్యమంత్రికి రుణపడి ఉండాల్సిన అవసరం ఉంది, రాబోయే ఎన్నికల్లో కూడా వైఎస్ జగన్‌నే ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గోనెగండ్ల మండల నాయకులు అలువాల ప్రమోద్ కుమార్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, సర్పంచ్ బాషా, సింగిల్‌విండో అధ్యక్షుడు తిరుమల రెడ్డి పాల్గొన్నారు. చెన్నాపురంలో జరిగిన కార్యక్రమంలో వైస్సార్‌సీపీ ఎమ్మిగనూరు మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, సర్పంచ్ జె.లక్ష్మి, ఎంపీటీసీ వై.సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరు టౌన్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సహకారంతో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ అంతర్రాష్ట్ర టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన శనివారం ప్రారంభించి మాట్లాడారు. 120కిపైగా జట్లు పాల్గొనే అవకాశం ఉందని, క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకొంటాని చెప్పారు. గెలుపోటములు సహజమని, స్నేహభావంతో పోటీల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. అలాగే ఎడ్ల బండలాగుడు పోటీలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, వక్ఫ్‌బోర్డ్ జిల్లా ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, ఎంపీపీ కేశన్న, వైస్ ఎంపీపీ పోలయ్య, కోఆపరేటివ్ స్టోర్స్, టౌన్‌బ్యాంక్ చైర్మన్లు షబ్బీర్‌అహమ్మద్, యుకె రాజశేఖర్, పట్టణ అధికారప్రతినిధి సునీల్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


బ్యాటింగ్ చేసి టోర్నీ ప్రారంభిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేద్దాం


యోగాసనంలో జెడ్పీ సీఈఓ, మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరు టౌన్/రూరల్: ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేద్దామని జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో జెడ్పీ సీఈఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26 నుంచి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి ఉప్పర ఫంక్షన్ హాల్‌లో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగాతో మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని ఆయన అన్నారు. వీవర్స్ కాలనీ హైస్కూల్ యోగా ఉపాధ్యాయురాలు భవాని విద్యార్థులకు యోగాసనాలను చేయించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఆంజనేయులు, మధుసూదన్‌రాజు, మున్సిపల్ ఏఈ మదన్, కౌన్సిలర్ డిష్ కేశవరెడ్డి పాల్గొన్నారు.

నందవరం: ఈ నెల 26న గ్రామ స్థాయిలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ప్రాంభమవుతాయని ఎంపీడీఓ దశరథ రామయ్య తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు టోర్నీ నిర్వహణ, అంపైరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు మ్యాచ్‌ల నిర్వహణ, లైవ్ స్కోర్‌ను మొబైల్‌లో అప్‌లోడ్ చేయడం తదితర విధులను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ ఈరన్న పాల్గొన్నారు.

ఎడ్ల బండిని ఢీకొన్న బైక్

- ఒకరికి గాయాలు

ఎమ్మిగనూరు రూరల్: స్థానిక ముగతి రోడ్డు అనంత పద్మనాభస్వామి ఆలయం సమీపంలో శనివారం రాత్రి ముందు వెళ్తున్న ఎడ్ల బండిని బైక్ ఢీకొన్న ప్రమాదంలో బైకిస్ట్ బోయ నాగన్న గాయాలపాలయ్యాడు. నందవరం మండలం ముగతి గ్రామానికి చెందిన బోయ నాగన్న పని నిమిత్తం బైక్‌పై ఎమ్మిగనూరుకు బయలుదేరాడు. ఆలయ సమీపానికి చేరుకోగానే ముందు వెళ్తున్న ఎడ్ల బండిని వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టాడు. ప్రమాదంలో ఎడమ కాలు మోకాలు చిప్ప పూర్తిగా డామేజ్ అయింది. క్షతగాత్రుడికి ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి కర్నూలుకు తరలించినట్లు వైద్యులు తెలిపారు.

ఆలూరు గురుకులం విద్యార్థినుల ప్రతిభ


ట్రోఫీ అందుకుంటున్న ఆలూరు విద్యార్థినులు

ఆలూరు: జోనల్ స్థాయి ఖోఖో, వాలీబాల్, టెన్నిస్‌బాల్ క్రీడల్లో ఆలూరు గురుకులం విద్యార్థినులు ప్రతిభ చూపారు. రెండు రోజుల నుంచి రేణిగుంట గురుకుల పాఠశాల ఆవరణంలో నిర్వహించిన ఖోఖోలో కదిరి, వాలీబాల్‌లో వైఎస్సార్ జిల్లా రాయచోటి, టెన్నిస్‌బాల్‌లో చిత్తూరు జట్లపై ఆలూరు గురుకులం విద్యార్థినుల జట్లు విజయం సాధించి శనివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్ చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నట్లు పాఠశాల పీఈటీ ప్రతాప్ తెలిపారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ షాహినూరు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు. కొందరు విద్యార్థినులు ఈనెల 28న విజయ నగరం జిల్లా కోనవలసలో జరగనున్న క్రీడలకు ఎంపికైనట్లు పీఈటీ తెలిపారు.

సంక్షిప్తం

ట్యాబ్‌ల పంపిణీ


ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకులం విద్యార్థినులకు ఎంపీపీ బొమ్మన సరళారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి దంపతులు, జెడ్పీటీసీ సుంకన్న, పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఏసు శనివారం ట్యాబ్‌ల పంపిణీ చేశారు. ఎంఈఓ–2 రమేశ్, ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసూన పాల్గొన్నారు.

నేటి నుంచి ఉరుసు

మద్దికెర: మండల పరిధిలోని బసినేపల్లి గ్రామ శివారులో కొలువైన కాశీం తాతకు ఆదివారం గంధం, సోమవారం ఉరుసు, మంగళవారం జియారత్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ముమ్మరంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు


పనులు పరిశీలిస్తున్న ఏఈ జయన్న

నందవరం: మండల కేంద్రంలో ముమ్మురంగా సాగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను శనివారం పంచాయతీ రాజ్ ఏఈ జయన్న పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాని కాంట్రాక్టర్లకు సూచించారు.

- సైన్స్ టాలెయింట్ టెస్టులో ప్రతిభ చూపిన స్థానిక జెడ్పీ పాఠశాల విద్యార్థులకు హెచ్‌ఎం శివరామ్ శనివారం సర్టిఫికెట్లు అందజేశారు.

క్రిస్మస్‌కు చర్చీల ముస్తాబు

గోనెగండ్ల: క్రిస్మస్ వేడుకలకు మండలంలో పలు చర్చీలను నిర్వాహకులు ముస్తాము చేశారు. గోనెగండ్ల ఎఫ్రాతా ప్రార్థన మందిరం, హెచ్ కైరవాడి, గంజిహళ్లి గ్రామాల ఏబీఎం చర్చీలలో వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

భగవద్గీత సారాంశాన్ని తెలుసుకోవాలి


స్వామిని దర్శించుకుంటున్న దృశ్యం

దేవనకొండ: భగవద్గీత సారాంశాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ సభ్యులు వీరేష్, భీమేష్, రఘునాథ్ సూచించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అయ్యప్పస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించి భగవద్గీతపై అవగాహన కల్పించారు.

భక్తులకు అక్షింతలు అందజేత

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామంలో శనివారం బీజేపీ నాయకులు నారాయణ, గోవిందరాజులు అయోధ్య నుంచి తెచ్చిన అక్షింతలు, శ్రీరామ మందిరం చిత్ర పటాలను భక్తులకు అందజేశారు. ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు అయోధ్య రామ మందిరం గురించి భక్తులకు వివరించారు.

ఎంపీల బహిష్కరణ సబబు కాదు

హొళగుంద: పార్లమెంట్ సమావేశాల నుంచి ఎంపీలను బహిష్కరించడం సబబు కాదని సోసియల్ డెమోక్రటిక్ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి రహిమాన్ అన్నారు. శనివారం ఆయన కార్యకర్తలతో కలిసి విలేకరులతో మాట్లాడారు.

క్లుప్తంగా

దేవనకొండలో డెంగీ కేసు నమోదు


పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దేవనకొండ: మండల కేంద్రంలో డెంగీ కేసు నమోదైనట్లు మెడికల్ ఆఫీసర్ కళ్యాణ్ తెలిపారు. శనివారం వైద్యసిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. దోమకు సంబంధించిన లార్వా గుర్తించి, దోమల నివారణకు పంచాయతీ సిబ్బంది చేత పిచికారీ చేయించారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి సాయిబాబా, సూపర్‌వైజర్‌లు రంగస్వామి, శ్రీధర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

తుగ్గలి: మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ప్రతిపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం తుగ్గలిలో ప్రధాన రహదారిపై భైఠాయించి రాస్తోరోకో నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తీవ్ర వర్షాభావంతో పంట దిగుబడులు కోల్పోయినా ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కేఈ శ్యాంబాబు, బత్తిన వెంకటరాముడు, నబిరసూల్, సుల్తాన్, భాస్కరరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీరాములు, క్రాంతినాయుడు, రాజశేఖర్, తిరుపాల్‌నాయుడు పాల్గొన్నారు.

నేడే కురువ మహా సింహగర్జన సభ


సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న శశికళ, కృష్ణమోహన్ తదితరులు

ఆలూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణం వెనుక మైదానంలో ఆదివారం మాదాసి/మాదారి కురువల మహా సింహ గర్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు బళ్లారి జిల్లా మాజీ డిప్యూటీ మేయర్ శశికళ తెలిపారు. సభ ఏర్పాట్లను శనివారం నాయకులు కృష్ణమోహన్ తదితరులతో కలిసి ఆమె పరిశీలించారు. ఏపీలోని వివిధ జిల్లాల ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు హాజరు కానున్నట్లు శశికల తెలిపారు. మాదాసి/మాదారి కురువలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శశికళ, కృష్ణమోహన్ కోరారు.

రైతులకు సన్మానం

వెల్దుర్తి(కృష్ణగిరి): జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు హరిసింహనాయుడు కృష్ణగిరి మండలం గోకులపాడు రైతులు నాగరాజు, మిన్నెల్ల, తదితరులను సన్మానించారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో గణం ఈశ్వరయ్య, మహేంద్రకుమార్, రామాంజనేయులు, నఫూల్‌బాషా పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి కిరీటం


వెండి కిరీటాన్ని నిర్వాహకులకు అందిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుకన్య

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని కనకదిన్నె గ్రామ దేవత పెద్దమ్మవ్వకు జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఈడిగ సుకన్య, నాగరాజు దంపతులు శనివారం వెండి కిరీటాన్ని బహుకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించిన అనంతరం ఆలయ నిర్వాహకులకు వెండి కిరీటాన్ని అందజేశారు.

20 గొర్రెలు మృత్యువాత


మృతి చెందిన గొర్రెలు

తుగ్గలి: పురుగు మందు నీళ్లు తాగి గొర్రెలు మృతి చెందిన ఘటన శనివారం ఎద్దులదొడ్డిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన హనుమంతు తన గొర్రెలను మధ్యాహ్నం సమీపంలోని ఓ బావి వద్దకు తీసుకెళ్లాడు. అప్పటికే పురుగు మందు కలిపిన బావి ఒడ్డున ఉన్న బకెట్‌లో నీటిని గొర్రెలు తాగాయి. కాపరి గమనించక పోవడంతో 20 గొర్రెలు మృతి చెందాయి. దాదాపు రూ.2.50 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.